# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 3వ అధ్యాయము - కర్మయోగము)

## మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2005
ప్రతులు : 1,000

వెల : రూ॥ **20-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
‘రాధామాధవమ్’,
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించియున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు,

విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

భగవద్గీత సర్వోత్కృష్టమైన గ్రంథము. కర్మాచరణమునకు, ధర్మాచరణమునకు, భక్తి జ్ఞాన వైరాగ్యములకు, మోక్షపదమునకు ప్రామాణిక గ్రంథము. భగవద్గీతపై అనేకానేక వ్యాఖ్యానములు గలవు. ఇకపైన గూడ రాగలవు.

నావాణి యందు గీతా వ్యాఖ్యానము, "గీతోపనిషత్" అను శీర్షికగా పాఠకులకు అందింపబడినది. ప్రతి అధ్యాయము తనదైన సందేశము నందించుట గీతయందలి విశిష్టతయగుటచే అధ్యాయమున కొక పుస్తకముగా సామాన్య పాఠకులకు భగవంతుని సందేశము నందించు ప్రయత్నము "ధనిష్ఠ" సంకల్పించినది. మాస్టర్ పార్వతీకుమార్ గారిచే అందించబడిన వ్యాఖ్యానము సామాన్యులకు కూడ స్ఫూర్తి కలిగించు విధముగ నుండుటచే ఈ ప్రచురణ చేపట్టితిమి. మొదటిగ సాంఖ్యయోగము ముద్రించితిమి. రెండవ గ్రంథముగా కర్మయోగము ముద్రించబడినది. మిగిలిన అధ్యాయములు గూడ కాలక్రమమున ప్రచురించ బడగలవు.

– ధనిష్ఠ

# పరిచయము

కర్మనిర్వహణము, కర్మ స్వరూప స్వభావములు, కర్మ కారణముగ బంధము, కర్మ కారణముగ మోక్షము, కర్మ సిద్ధాంతము శ్రీకృష్ణ పరమాత్మ వివరించినట్లుగా మరెవ్వరును వివరింపజాలరు. భగవద్గీత యందు అత్యంత ప్రాధాన్యము వహించు సూత్రము నిష్కామకర్మము. కర్మమును నిష్కామముగ ఫలాసక్తి లేకుండ, సంగము లేకుండ సమర్పణ బుద్ధితో నిర్వర్తించుట ఎట్లో భగవానుడు తానుగా ప్రతి సన్నివేశమున తాను నిర్వర్తించి మనకు ఎఱుక పరచినాడు. ఇంతకు మించిన కర్మజ్ఞాన మెచ్చటనూ లేదు. తాను సంపూర్ణముగ నాచరించి బోధించుటచే శ్రీ కృష్ణు డొసగిన కర్మజ్ఞానము పరిపూర్ణము. మానవులకు వలసినది కర్మజ్ఞానమే. తెలిసి ఆచరించుట వలన సుఖశాంతులు కలుగ గలవు. శ్రద్ధాళువులైన సాధకులకు ఈ చిన్న పుస్తకము కర్మాచరణమున సహాయకారిగా నుండగలదు.

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| | సందేశము | ..... | 9 |
| 1. | ప్రాథమిక సూత్రములు | ..... | 13 |
| 2. | శ్రద్ధ – భక్తి | ..... | 18 |
| 3. | నియతకర్మ | ..... | 20 |
| 4. | సమాచరణము | ..... | 21 |
| 5. | ఉపదేశము | ..... | 23 |
| 6. | ఆరాధనము | ..... | 25 |
| 7. | పరహితము | ..... | 27 |
| 8. | మోక్షము – బంధము | ..... | 30 |
| 9. | ధర్మ చక్రము | ..... | 32 |
| 10. | అసక్తత – సమాచరణము | ..... | 35 |
| 11. | సంఘ శ్రేయస్సు | ..... | 38 |
| 12. | పెద్దలు – ప్రమాణములు | ..... | 40 |
| 13. | కర్మ – ప్రతిఫలాసక్తి | ..... | 44 |
| 14. | సదాచరణ | ..... | 46 |
| 15. | గుణత్రయ సృష్టి | ..... | 48 |
| 16. | సృష్టి రసాయనము | ..... | 50 |
| 17. | సంగము – అసంగము | ..... | 52 |
| 18. | శరణాగతి | ..... | 54 |
| 19. | శరణాగతి సూత్రములు | ..... | 56 |
| 20. | ఎంపిక | ..... | 58 |
| 21. | నిగ్రహము – అనుగ్రహము | ..... | 60 |
| 22. | ఇంద్రియ సృష్టి – ద్వంద్వములు | ..... | 62 |
| 23. | స్వధర్మము | ..... | 64 |
| 24. | అగ్ని కార్యము | ..... | 67 |

# సందేశము

కర్మయోగము పేరున శ్రీ కృష్ణు డిచ్చిన కర్మసూత్రములు క్లుప్తముగ ఈ క్రింది విధముగ నున్నవి.

1. చేయుచు నేర్చుకొనుచుండవలెను. అపుడే వృద్ధి.
2. కర్తవ్యము మేరకే కర్మలను నిర్వర్తించవలెను. భాషణమైననూ అంతే.
3. కేవలము పనియందు మాత్రమే శ్రద్ధ, భక్తి, ఆసక్తి కలిగి యండవలెను. కర్మ నిర్వహణమున యితరముల యందు ఆసక్తి, శ్రద్ధను చెరచును.
4. ఇతరుల పనులలో చొరబడక, నీ పని నీవు నిర్వర్తింపుము.
5. చేయుపని ఎక్కువ తక్కువలు లేక యుండవలెను. దానినే సమాచరణ మందురు.
6. చతుర్ముఖ బ్రహ్మ చేయు సృష్టియందు అతనికి వ్యక్తిగత లాభము లేదు. ఆనందమే యున్నది. కావున కర్తవ్య

నిర్వహణమే గాని అందు లాభనష్టములు చూడకుడదని బ్రహ్మోపదేశము.

7. తోటిజీవులకు శ్రేయస్సుగా కర్మల నాచరించుటయే, నిజమగు దేవతారాధనము.

8. ఇతరుల కొనర్చు సేవ ఆనందము కలిగించును. కేవలము తన ఆనందము కొరకు చేయు పనులలో యితరుల శ్రేయస్సు లేనిచో దుఃఖమే కలుగును.

9. నిష్కామ కర్మము, కర్మనుండి మోక్షము నీయగలదు. కామ్య కర్మ బంధము కలిగించును.

10. సృష్టి యందొక ధర్మచక్ర మున్నది. జీవులన్నియు ధర్మ చక్రము ననుసరించి, ఒకరి కొకరు సహకరింతురు. మానవుడు కూడ అట్లే సహకరించనిచో, చక్రము బంధించును.

11. సత్కర్మలనుండి సత్ఫలితములు కలుగవచ్చును. (సంపద, కీర్తి.) ఫలితముల యందు ఆసక్తి కలిగినచో బంధము కలుగును.

12. సంఘశ్రేయస్సే ప్రధానముగా జనకాది రాజర్షులు జీవించిరి. సంఘశ్రేయస్సే చేయుట కర్తవ్యమైన పని.

13. పెద్దలను చూచి పిన్నలు అనుకరింతురు. కావున పెద్దలు బాధ్యతతో మెలగవలెను.

14. తెలిసినవారు ఫలమందాసక్తి లేనప్పటికిని, కార్యములను అత్యంతాసక్తితో నిర్వర్తింతురు. ఆసక్తి పని యందేగాని, ఫలితమందు కాదు.

15. తెలిసినవారు, కర్మలను ఎక్కువ తక్కువ లేకుండ నిర్వర్తించి, ఫలితములను మనస్సున విడచి యుందురు.

16. అహంకారి తానే చేయుచున్నానని భావించుచు బంధించు కొనును. నిజమునకు ప్రకృతి గుణములే అతనిచేత కర్మలను నిర్వర్తింపజేయు చున్నవి.

17. అహంకారికి మూఢత్వము, మోహత్వము ఎక్కువగ నుండును.

18. ఆశ, మోహము లేక కర్తవ్యమును నిర్వర్తించుచు ఫలితము లను దైవమున కర్పించుట శరణాగతి.

19. శరణాగతి మార్గమున ఆశ, మోహములే కాక అసూయను కూడ వదలి, శ్రద్ధతో కార్యములను నిర్వర్తించుచు ఫలితములను దైవమునకు సమర్పింపవలెను.

20. బుద్ధి, విచక్షణ కలిగి కర్తవ్యమును ఫలాపేక్ష లేకుండ నిర్వర్తించుట యొక మార్గము. బుద్ధికి కూడ మోహము కలిగినపుడు, దైవమునకు సమర్పణ చెంది కార్యములు నిర్వర్తించి, ఫలితములను దైవమునకు సమర్పించుట మరి యొక మార్గము.

21. జ్ఞానులు సైతము ప్రకృతి గుణములతో నడిపింప బడుచుందురు. కావున నిగ్రహ మార్గము కన్న, అనుగ్రహ మార్గము మిన్నయైనది.

22. ఇంద్రియ సృష్టి అంతయు ద్వంద్వమే. ఇంద్రియ నిగ్రహము కన్న, దైవానుగ్రహమునకై ప్రయత్నించుట శ్రేయస్సు.

23. తన ప్రవృత్తికి సరిపడు కార్యములనే చేయవలెను గాని, సంపద, కీర్తి, గౌరవము, అధికారము కలుగునని యితర మార్గముల జీవించరాదు.

24. సృష్టి యొక అగ్ని కార్యము. అగ్ని కార్యమున మలినములు పుట్టుట తప్పవు. మనస్సున, శరీరమున కలుగు మలినము లను ప్రతినిత్యము నిర్మూలించుకొనుట కర్తవ్యము.

1

# ప్రాథమిక సూత్రములు

*అర్జున ఉవాచ :*

జ్యాయసీ చే త్కర్మణస్తే మతా బుద్ధి ర్జనార్దన ।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥ 1

వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహ మాప్నుయామ్ ॥ 2

*శ్రీభగవా నువాచ :*

లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3

న కర్మణా మనారంభా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 4

న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మకృత్ ।
కార్య తే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥ 5

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।
ఇంద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే ॥ 6

**చేయుట - నేర్చుట :**

"పనులు చేయుచు నేర్చుకొనవలెనా? నేర్చుకొనుచు చేయవలెనా?" రెండునూ ఒకటే. సామాన్య జీవితమున జీవుడు లేచినది మొదలు ఏదియో ఒకటి చేయుట తప్పనిసరి. దంత ధావనము, స్నానము, వస్త్రధారణము, భోజనము, సంఘమున ఏదియో ఒక పని, విలాసము, విశ్రాంతి తప్పనిసరి పనులు. చేయుట తప్పనిసరి యైనప్పుడు చేయుచు నేర్చుకొనవచ్చును. నేర్చుకొనుటకు చేయుటను ఆపనక్కరలేదు. ఇది కృష్ణుని మతము. చేయుచు నేర్చుకొనుట తెలివి. చేయుచు నేర్చుకొనుట అనినను, నేర్చుకొనుచు చేయుట అనినను ఒకటే. నేర్చుకొనని వాని చేతలలో నిపుణత పెరగదు. కౌశలము పెరగదు. కావున పనులు కుశలముగా జరుగవు. అడ్డంకులు వచ్చును. లోపల, బయట ఘర్షణము పెరుగును. పనులు చేయుట యందు నిపుణత పెరగవలెనన్నచో ఎట్లు చేయవలెనో కూడ నేర్చుకొను చుండవలెను. నేర్చుకొనకుండ చేయువాడు దుఃఖపడును. నేర్చుకొనుచు చేయువాడు సుఖపడును.

ఒక పనినిగాని, ఒక వృత్తినిగాని, వ్యాపారమునుగాని, ఉద్యోగముగాని, సంఘసేవ గాని, స్వాధ్యాయముగాని, తపస్సు గాని చేయువాడు ప్రతిదినము ముందు రోజు కన్న బాగుగ చేయుటకు పూనుకొనవలెను. ప్రతి పని పెద్దదికాని, చిన్నది కాని నిన్నటి కన్న ఈ రోజు ఇంకొంచెము బాగుగ చేయుటకు నేర్పు

కావలెను. చేయుట వలన కూడ నేర్చుకొనవచ్చును. నేర్చుకొనుచు చేయవచ్చును. చేయుచు, ఎట్లు నేర్వవలెనో భగవంతుడు తెలిపిన విషయమును కర్మయోగ మనిరి.

చేయక ఊరక నేర్చుకొనుట, చేయుచు నేర్చుకొనకుండుట నిష్ప్రయోజనము. చాలమంది ఈ ఉపాయము తెలియక నేర్చు కొనుటకు చేయుట నాపుదురు. చేయనివాని జ్ఞానము అనుభవైక జ్ఞానము కాదు కదా! అట్టివారు మిథ్యాచారులుగ, మూర్ఖులుగ దిగజారుదురు. శరీరమును, యింద్రియములను, మనసును నియోగించుటకే దైవమందించినాడు. వానిని వినియోగింపక పోవుట ఎవని తరము కాదు. వానిని నియమించి సద్వినియోగము చేయుట కర్తవ్యము. అందువలన వాటిని అరికట్టక, దమింపక నియమించి వినియోగించుట నిజమైన యోగము. ఎట్లు నియమించి వినియోగించవలెనో ఈ అధ్యాయమున(కర్మ యోగమున) దైవము తెలుపుచున్నాడు.

***ఆవశ్యకత :***

కర్మల నెట్లు ఆచరించవలెనో, ఎట్లాచరించినచో చేయు కర్మల నుండి బంధము లేర్పడవో భగవానుడు కర్మయోగమున తెలియపరచుచున్నాడు. తాను తెలిపిన విధముగ సృష్టిలో కర్మల నాచరించుచు ముక్తసంగులై జీవించుచున్న వారిని కూడ కర్మయోగమున దైవము పేర్కొనినాడు. కర్మ స్వరూప స్వభావము లను ఎరుగక తెలిసినవారు కూడ పొరపాట్లు చేయుట జరుగు

చున్నది. కర్మ నిర్వర్తించు విధానము విద్యాభ్యాస కాలముననే తెలుసుకుని అట్లాచరించుటకు యుద్యుక్తుడైనవాడు జీవితమను రంగస్థలమున ప్రవేశించుటకు, కౌశలముగ వర్తించుటకు, తదను భూతిని నిత్యమును అనుభవించుటకు అర్హత కల్గి యుండును. ఈ విద్య మృగ్యమగుటచే ఆధునిక మానవుడు ఎన్ని సౌకర్యములు కలిగి యున్నప్పటికిన్ని దుఃఖము చెందుచునే యున్నాడు. ఘర్షణ పడుచునేయున్నాడు. తీవ్రమైన విరోధములకు, రోగములకు గురియగు చున్నాడు.

**తృప్తి :**

జీవితమున ప్రశాంతత, సుఖశాంతులు, తృప్తి, మంచి తనము, ఆనందము ముఖ్యము. వీటికి పదవులతోగాని, సంపదతో గాని, గొప్పదనముతోగాని, అధికారముతోగాని సంబంధము లేదు. అవి కలిగినచో కర్మయోగి వైభవము కలిగినవా డగుచున్నాడు గాని వాని కొఱకై ప్రత్యేక ప్రయత్నముండదు. కర్మయోగ మనగా కర్మ లెట్లు నిర్వర్తించవలెనో అను విధానముతో అనుసంధానము చెంది జీవించుట. ఆ విధానమును భగవంతుడు చక్కగ విశద పరచినాడు. ప్రాథమికమగు కర్మయోగ సూత్రములను అనుస రించనివారు జీవితమున నేల విడచి సాము చేసినవారగుదురు. వారు చతికిల పడకతప్పదు. మిథ్యాచారులై తమను తాము మోసము చేసుకొనుచు, ప్రపంచమును దూషించుచు గమ్యము లేక అందినదల్ల సంగ్రహించుచు జీవింతురు.

కర్మయోగ సూత్రములను పునాదిగా నేర్పరచుకొనని జీవనము పునాదిలేని ఇల్లువలె స్థిరత్వము లేక, ఎపుడు కూలునో యను భయముతో జీవించుట యుండును. ఆలస్యమైనది అని తలపక దీక్షతో ఈ సూత్రములను పాటించుటకు ప్రయత్నించువాడు ప్రశాంత జీవనమునకు, భక్తి జ్ఞాన వైరాగ్యములకు అర్హత పొందును.

(3అ-1 నుండి 6 శ్లో॥)

## 2

# శ్రద్ధ - భక్తి

యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ।
కర్మేంద్రియైః కర్మయోగ మసక్త స్స విశిష్యతే ॥ 7

తమను తాము కర్మలయందు బంధించుకొనక జీవించు విధానము శ్రీకృష్ణుడు ఈ క్రింది విధముగ తెలుపుచున్నాడు. వీనిని శ్రద్ధతో అధ్యయనము చేసి అనుసరించిన వానికి జీవితము ఒక క్రీడగ సాగును. అట్లు కానిచో జీవితమున బంధము తప్పదు.

***అసక్తస్స, ఆరభతే, కర్మయోగమ్ :***

ప్రతిదినము కర్మల నాచరించువాడు సంగము లేక ఆచరించినచో అతడు ఉత్తమ కర్మిష్ఠిగ నుండగలడు. సంగము లేక కర్మలాచరించుట యనగ, తన కర్తవ్యమును తను శ్రద్ధా భక్తులతో నిర్వర్తించుట. ఫలితములవైపు మనస్సును పోనీయ కుండుట. అనగా తినునపుడు, మాటాడునపుడు, పనులు చేయుచున్నపుడు వానియందు పరిపూర్ణమైన శ్రద్ధ, భక్తి ఉండ వలెను. వానిని నిర్వర్తించు తీరు తెలుసుకొని అట్లే నిర్వర్తించుచు

నుండవలెను. ఎక్కువ తక్కువలు చేయరాదు. ఫలితముల వైపుకు మనస్సును పోనీయరాదు. విద్యార్థులకు విద్యయందు శ్రద్ధ ఉండవలెను గాని మార్కుల యందు గాదు. పని చేయువాడు పనియందు శ్రద్ధగాని నెలసరి భత్యమునందు కాదు. ఇట్లు సమస్తమునందు శ్రద్ధాపూరిత కర్తవ్య నిర్వహణమే కాని, ఇతరములందు ఆసక్తి జనింపరాదు. ప్రస్తుత మెప్పుడును కర్తవ్యమునే బోధించుచుండును. దానిని గ్రహించి నిర్వర్తించుటే మార్గము. చిన్నతనము నుండి ఈ పద్ధతి నభ్యసించినచో మనిషి కర్మ నిర్వహణమున శ్రేష్ఠముగ నిలచియుండును. (3-7)

# 3

# నియత కర్మ

నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః ॥ 8

నియమింపబడిన కర్మను మాత్రమే చేయుట రెండవ సూత్రము. తన పని తాను చేయుట, అదికూడ శ్రద్ధతో చేయుట ముఖ్యము. తనది కాని పని తాను చేయుటవలన జీవుడు బద్ధుడగును. తన పని ఏమో తాను తెలుసుకొని హద్దులు మీరక నిర్వర్తించవలెను. తన పనిలో లోపములు లేకుండ నిర్వర్తించుటే తనకు ముఖ్యము. ఇతరుల పనులలో జొరబడుట, వారి పనుల లోని లోటుపాటులను చర్చించుట, విమర్శించుట తగదు. అట్లు చేయువారికి తమ పనులను నిర్వర్తించుకొను సామర్థ్యము తగ్గును. శ్రద్ధ తగ్గును గనుక సామర్థ్యము తగ్గును. ఇతరుల పనులలో తలదూర్చువారు వడ్రంగము పనిచేయుటకు పూనుకొనిన కోతివలె దుఃఖపడుదురు. తమకు నియమించిన పని చేయకపోవుట వలన జీవనయాత్ర కుంటుపడును. అందుచేత దైవము ఏకాగ్రతతో, నియంత్రిత పని నియమముతో, శ్రద్ధతో ఆచరింపుమని రెండవ ఆదేశము చేసినాడు. (3-8)

# 4

# సమాచరణము

యజ్ఞార్థా త్కర్మణోఽ న్యత్ర లోకోఽ యం కర్మబంధనః ।
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగ స్సమాచర ॥ 9

*యజ్ఞార్థం కురు కర్మాణి :*

నియమితమైన కర్మను శ్రద్ధాభక్తులతో సంగము విడిచి చేయవలెనని తెలిపిన శ్రీకృష్ణుడు, చేయు కర్మ యజ్ఞార్థమై యుండవలెనని మూడవ సూత్రమున పలికినాడు. అనగా కర్మము లోకహితార్థముగ చేయుమని అర్థము. లోకహితమే తన హితము. అందుచేత కర్మమునకు ప్రాణసమానమైన లక్షణము పరహితము. లోకమునకు హితము కానిది తనకు కూడ హితము కాదు. ఇది తెలిసి కర్మల నాచరించవలెను. సంఘద్రోహము, దేశద్రోహము, జీవద్రోహము చేయు కర్మల నుండి బంధము కలుగును. ఇతర జీవులకు అహితము, హింస కలుగు పనులు చేయరాదు. మనస్సున ప్రధాన ముగ పరహితమే గోచరించవలెను. చేయు పనులందు పరహితమే ప్రతిబింబించవలెను.

సంగము లేక, నియత కర్మను లోకహితముగ ఒనర్చుట వలన జీవుడు బంధింపబడుటకు ఎట్టి అవకాశమును ఉండదు. అట్టివాడు సమాచరుడై యుండును. అనగా ఆచరణమున సమత్వము కలిగి యుండును. (3-9)

# 5

# ఉపదేశము

సహ యజ్ఞాః ప్రజా స్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేష వోఽ స్త్విష్టకామధుక్ ॥ 10

*యజ్ఞేన ప్రసవిష్యధ్వం :*

బ్రహ్మదేవుడు సృష్టించినపుడు జీవులు, లోకములు, లోకపాలకులు ఏర్పడిరి. అవ్యక్తమైన తత్త్వము నుండి బ్రహ్మదేవుడు వాహికగ సమస్తము కొనిరాబడినది. బ్రహ్మదేవుడు పై కార్యమెందులకు చేసినాడు? దాని వలన అతనికేమి ప్రయోజనము? వ్యక్తిగతముగ ఏ ప్రయోజనము లేదు. సృష్టి నిర్మాణము ఒక బృహత్తర పథకము. అట్టి కార్యములు నిర్వర్తించుట వలన బ్రహ్మదేవునకు ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనము లేదు. చతుర్ముఖ బ్రహ్మ స్థితికి (అస్తిత్వమునకు) కారణము సంకల్పము. సంకల్పము అవ్యక్తమగు బ్రహ్మమునుండి పుట్టి బ్రహ్మ నేర్పరచుకొన్నది. ఆ సంకల్పము ననుసరించి బ్రహ్మదేవు నేర్పరచుకొని అతని నుండి కోటానుకోట్ల జీవులుగాను, సప్తలోకములుగాను, అందలి అంతర్లోకములుగాను,

లోకపాలకులుగాను, ప్రకృతి శక్తులుగాను, కాలము దేశములు గాను, శబ్దముగాను వర్ణముగాను, అంకెలుగాను, రూపములు గాను ఏర్పడినది. ఆ దివ్యసంకల్పమును అనుసరించి వ్యక్తిగత ప్రయోజనములను చూడక అత్యంత బాధ్యతాయుతమైనటు వంటి కార్యమును బ్రహ్మదేవుడు నిర్వర్తించినాడు. అందు బ్రహ్మ దేవునకు ఎట్టి కామము లేదు. సంగము లేదు. మోహము లేదు. లోభముగూడ లేదు. ఇట్లు నిర్వర్తించు కార్యమునే యజ్ఞ మనిరి. పై విధముగ నిర్వర్తించుటచే సమస్త సృష్టికిని చతుర్ముఖ బ్రహ్మ ఆరాధ్యుడైనాడు. అట్టి బ్రహ్మ చేసిన ఉపదేశమొకటి గలదు. అదియే "యజ్ఞేన ప్రసవిష్యధ్వం" అనగా "యజ్ఞములు చేయుచు వృద్ధిని పొందుడు."

బ్రహ్మదేవుడు యజ్ఞమును చేసి వృద్ధిని పొంది ముక్తుడుగా దైవమందు నిలచినాడు. మీరును అట్లే యజ్ఞార్థముగా జీవించుచు నావలెనే వృద్ధి పొందుడు అని ఉపదేశమిచ్చినాడు. బుద్ధిమంతు లైనవారు ఈ విషయమును గ్రహించి తదనుగుణ్యముగ జీవిత మును క్రమశః మలచుకొనవలెను. తాను నిర్వర్తించి తద్వారా వృద్ధిపొంది అనుభవ పూర్వకముగ అందించిన ఉపదేశమిది. సృష్టికి చతుర్ముఖ బ్రహ్మ ప్రథమస్థానమున నుండుట కిదియే ఉపాయము. కావున యజ్ఞార్థ కర్మము మనసునకు పట్టునట్లుగ అవగాహన చేసుకొనవలెను. అటుపై ఆచరించవలెను. అట్లు కానిచో బంధములు తప్పవు. (3-10)

## 6

# ఆరాధనము

దేవా న్భావయతానేన తే దేవా భావయంతు నః ।
పరస్పరం భావయంతః శ్రేయః పర మవాప్స్యథ ॥ 11

*శ్రేయః పర మవాప్స్యథ :*

దేవతలు మానవులకు సహాయము చేయగలరు. దేవతలకు ప్రీతి కలిగించు మార్గము యజ్ఞార్థ జీవనమే. దేవతలు సంతుష్టులైనచో మానవులకు సంతుష్టిని, వృద్ధిని యొసగుదురు. మానవుల వృద్ధికి సహకరింతురు. దేవతలను ఆరాధించుట యనగా మానవుడు గూడ దేవతలవలె పరహిత ధర్మమునకు తన జీవితమును సమర్పించవలెను. దేవతలట్లే సమర్పించుటచే సృష్టి ప్రణాళిక నెరిగి సృష్టిని నిర్వహణము చేయుచున్నారు. తమవలెనే ఏ మానవుడు పరహిత కార్యములకు సమర్పణ చెందునో అట్టి మానవుడు దేవతల ఆశీర్వచనము పొందును.

శ్రీకృష్ణుడు తెలిపిన భగవధారాధనము యిదియే. స్తుతి కొరకు, స్ఫూర్తి కొరకు ఆరాధనములు సలిపినను పరహితము సలుపని జీవితము జీవులకు హితముగా నుండనేరదు. దేవతారాధన

మనగా పరహితధర్మము నాచరించుట. స్వహితమును ఆశింప కుండుట. ఇది సర్వ శ్రేయోదాయకము. పరమ శ్రేయోదాయకము. పరమశ్రేయస్సు దీనివలననే కలుగునని "శ్రేయః పర మవాప్స్యథ" అని పలికినాడు.

నందగోపుడు వర్షాదులు కురియుటకై ఇంద్రుని ఆరాధించ వలెనని సంకల్పించినాడు. బాలకృష్ణుని అడుగగా, ఇంద్రుని ఆరాధన పూజాది కార్యక్రమములుగా కాక, తోటిజీవుల శ్రేయస్సుగా కర్మ నాచరింపుమని బాలకృష్ణుడు తెలిపినాడు. భగవద్గీతలో శ్రీకృష్ణు డిచ్చిన పరమోత్కృష్టమైన ధర్మమిది. అతడు దేవతాప్రీతికై యజ్ఞ యాగములను, పూజాభిషేకములను, హోమములను తనకుగా తాను ఎన్నడును నిర్వర్తించలేదు. నిర్వర్తిస్తున్న వారిని గౌతమ బుద్ధునివలె ఖండించలేదు. తనను సలహా అడిగినవారికి మాత్రము దేవతారాధన మనగా పరహిత జీవనమే అని తెలియజెప్పినాడు. దైవమొక్కడే. అతని కార్యమునే దేవతలు చేయుచున్నారు. వారు నిష్కాములు. జీవులు గూడ దేవతలను మార్గదర్శకులుగ నెంచు కొని, ఆ మార్గమునే నడచినచో దివ్యత్వము పొందగలరు. దేవత లను, గురువులను మార్గదర్శకులుగా భావించుట, గౌరవించుట, పూజించుట తగుమాత్రముగ జరుగుచుండవలెను. అవియే ప్రధాన కార్యములైనచో ముక్తజీవనము దుర్లభము. పరమ శ్రేయస్సునకు పరహితమే పరమధర్మమని శ్రీకృష్ణుడు, శ్రీరాముడు నిర్వర్తించి బోధించినారు. అదియే సనాతన ధర్మమార్గము. జీవుల శ్రేయస్సే దైవారాధనముగ సాగుట కృష్ణుడు తెలిపిన కర్మబంధ విమోచన మార్గము. (3-11)

# 7

# పరహితము

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।
తైర్దత్తా నప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥ 12

*యః అప్రదాయః, సహస్తేన ఏవః :*

పరహిత కార్యములను నిర్వర్తించుచు తద్వారా దేవతల ప్రీతి నందినవాడు భోగ్యమగు అనేక విషయములను వారి యనుగ్రహముగ పొందుచుండును. అట్లు విశేషములైన భోగములను గూడ అనుగ్రహింపబడును. అనుగ్రహింపబడిన భోగ్య విషయములు తనకు తానే అనుభవించుట దొంగతనము. అట్టి దొంగ మరల పతనము చెందగలడు.

లభించిన భోగ భాగ్యములు ఇతరుల శ్రేయస్సు కొరకు వినియో గించువాడు బుద్ధిమంతుడు. తనకు తానే అనుభవించువాడు మూర్ఖుడు. అట్టి మూర్ఖుడు తన ప్రవర్తనము ద్వారా తానే పతనము చెందుచుండును. తాను పరహిత కార్యము లొనర్చుటచే దేవతానుగ్రహము పొందినవాడు. దేవతలు అనుగ్రహించుటకు

కారణము తనయందు పరహిత బుద్ధి యున్నదని. భోగ్యవిషయము లభ్యముకాగానే, పరహిత ధర్మము మరచుట కృతఘ్నుత్వమగును. అందించిన ప్రతి భోగ్యవిషయమును పరహితమునకే సమర్పించుట వృద్ధికి కారణమగును. అట్లు కానిచో వృద్ధి యాగును. పతనము ప్రారంభమగును.

పరహిత బోధనలు విన్న పేద బ్రాహ్మణుడొకడు తనకుగల రెండు అంగవస్త్రములలో ఒక దానిని గౌతమబుద్ధునకు సమర్పించెను. ఆనందముతో ఏకవస్త్రము ధరించి బాటను పోవుచున్న పేద బ్రాహ్మణుని చూసి, ఆదేశపు రాజు, విషయము తెలుసుకొని బ్రాహ్మణునకు పది అంగవస్త్రముల జంటను అందించినాడు. లభ్యమైన పది అంగవస్త్రముల జంటలను బ్రాహ్మణుడు మరల దానము చేసి ఏకవస్త్రుడుగ నిలచి అమితానందము పొందినాడు. పై విషయము తెలిసిన రాజు బ్రాహ్మణునియందు మిక్కిలి సంతసించి ధన కనకములు, ధాన్యము బ్రాహ్మణున కందించినాడు. అవియును గూడ మండలము రోజులలో ఇతరుల శ్రేయస్సునకు వినియోగించి మరల ఏకవస్త్రుడుగ చరించసాగినాడు. ఈ విషయము తెలిసిన రాజు ఆనందభరితుడై, బ్రాహ్మణునకు సస్యశ్యామలమైన అగ్రహారము నిచ్చినాడు. అగ్రహారమునంతను బౌద్ధసన్యాసులకు ఆశ్రమముగ నేర్పరచి పేద బ్రాహ్మణుడు పరమానందభరితుడై బుద్ధుని సాన్నిధ్యము పొందినాడు. రాజు మిక్కుటముగ ఆనందము

పొంది పరహితమార్గమున పరిపూర్ణముగ నడచుటకు సంకల్పించి, దీక్షగ లోకహితమును ఆచరించి రాజర్షియై దైవసాన్నిధ్యమున నిలచినాడు. ఇట్లు తనదగ్గర ఉన్నటువంటి విద్యగాని, తెలివిగాని, శక్తిగాని, ధనాదులుగాని ఇతరుల శ్రేయస్సు కొరకై వినియోగించు వాడు సృష్టియందు నిజమైన రాజుగ నిలచును. అట్లు జీవించని వారు ఎప్పుడును పేదలే. పేదలేగాదు దొంగలు కూడ అని కృష్ణుడు కర్మానుష్ఠాన రహస్యమును తెలిపినాడు. (3-12)

# 8

# మోక్షము - బంధము

**యజ్ఞశిష్టాశిన స్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।**
**భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మ కారణాత్ ॥ 13**

***యజ్ఞశిష్టాశిన స్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః :***

కర్మానుష్ఠాన మార్గమున మలినముల నుండి విముక్తి చెందుటకు భగవానుడీ సూత్రము పలికినాడు. ఇతరులకు పెట్టి తాను తినువాడు పవిత్రుడగును. తనకు తాను తినువాడు అపవిత్రు డగును. ఇది సృష్టి ధర్మము. వ్యాపారము చేయువాడు తన సంస్థ యందలి సమస్త కార్యవర్గమునకు జీతభత్యములను ఏర్పరచి, ప్రభుత్వమునకు ఈయవలసినది, సంఘమునకు ఈయవలసినది ఇచ్చి, కుటుంబ సభ్యులకు కూడ అందించవలసినది అందించి, అటుపైన తననుగూర్చి భావించవలెను. అట్లు చేసినచో యజ్ఞమున మిగిలిన అవశిష్టమును భుజించినవాడగును. అందరి పరితృప్తి తరువాత తన తృప్తి. అందుచేత అతని యందు తన శ్రేయస్సు కన్న ఇతరుల శ్రేయస్సు మిన్నగ యుండును. అదియే పవిత్రతకు కారణము. అదే విధముగ ఒక అధికారి, ఒక యజమాని తన

ఆశ్రయములో (లేక పరిధిలో) నున్నవారి క్షేమమును నిర్వర్తించి అటుపైన తనను గూర్చి అలోచింపవలెను. ఇది ధర్మము.

అందరికన్న ముందుగ భోజనము చేయుట, అందరికన్న ముందుగ తాను పొందుట, ముందుగ అనుభవించుట మొదలగున వన్నియు అపవిత్రమగు కార్యములు. పోటీపడి ఇతరుల కన్న తాను ముందు పొందవలెనను భావనతో జీవించువాడు, మానసికముగ బంధితుడు. అతడు యావజ్జీవ బంధితుడే. ఈ విషయము తెలియక ఆధునిక యుగమున పోటీలు ఎక్కువ అయినవి. తత్కారణముగ అశాంతి ఎక్కువైనది. తత్కారణముగ ఘర్షణలు, హత్యలు, మారణ హోమములు జరుగుచున్నవి. తోటి వారి శ్రేయస్సును గమనించని వాడు నరపశువేగాని నరుడు కాదు. నరపతి కాదలచినచో లోక హితమునకై పాటుపడవలెను గాని పశువువలె కుమ్ము లాడుచు, దౌర్జన్యముతో దోచుచు భోగించువాడు భయంకరముగ బంధింప బడును.

తెలిసి నిర్వర్తించిన వారికి కర్మలు మోక్ష కారణము. తెలియక నిర్వర్తించువారికి కర్మలు బంధకారణము. మోక్షము పేరున మోహ పడిన జీవులు ఎన్నో రకములుగ ఇతర ఉపాయముల నాలోచింతురు. కర్మ మార్గమున మోక్షము సులభమని తెలిసినవారు తమ వంతు కర్మను యజ్ఞార్థముగ నిర్వర్తింతురు.

ఒక మనిషి పవిత్రతకు, అపవిత్రతకు మూలకారణము అతని కర్మానుష్ఠాన విధానముననే యున్నది. కర్మను జీవ శ్రేయోదాయకముగ నిర్వర్తించిన పవిత్రుడగుచు అగ్నిహోత్రునివలె ప్రకాశించును. లేనిచో అంధకారమున పడును. (3-13)

# 9

# ధర్మచక్రము

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయ తీహ యః ।
అఘాయు రింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16

*ఏవం ప్రవర్తితం చక్రం :*

సృష్టి చక్రమున ధర్మచక్ర మొకటి యున్నది. ఆ ధర్మ చక్రమున నిలచినవారు బ్రహ్మమునందు నిలచి అక్షరులై దీపించు చున్నారు. ఆ ధర్మ చక్ర మిట్లున్నది.

1. బ్రహ్మము నుండి వేదము పుట్టును.
2. వేదము నుండి సృష్టి పుట్టును. సృష్టితో పాటు సృష్టి ధర్మమునూ పుట్టును.
3. సృష్టి, ధర్మము ననుసరించుచు ఏర్పడును. అదియే సృష్టికర్మ.
4. పై సమస్తమును యజ్ఞార్థమే. సృష్టియందలి జీవులు గూడ అదే యజ్ఞార్థ ధర్మమును అనుసరించుచు మరల బ్రహ్మమును చేరుదురు.
5. ధర్మ మాధారముగ ఈ చక్రము తిరుగుచుండును.

ఈ చక్రము ననుసరించి ఎవరు జీవింతురో వారు బ్రహ్మము నుండి దిగివచ్చినవారై, సృష్టి వైభవమును అనుభవించుచు మరల బ్రహ్మమును చేరుదురు. అనుసరింపనివారు ధర్మచక్రము నుండి విడివడుటచే బంధముల చిక్కుకొని దుఃఖముల ననుభవించు చున్నారు.

ధర్మచక్రమును వీడినవారు మనస్సు, ఇంద్రియములు, శరీరమునందు బంధింపబడి భోగములయందు చిక్కుకొని ఎడతెరపి లేక నానావిధ యోనుల యందు జన్మ మెత్తుచున్నారు. వీరందరు సృష్టి ప్రయాణమున రైలుబండి దిగినవారివలె గమ్యము చేరక ప్రయాణమాగి వ్యర్థముగ జీవించుచున్న వారిగ తెలియ వలెను. సృష్టి చక్రమునగల ధర్మచక్రము వృత్తాకారపు రైలుమార్గము వంటిది. ఈ మార్గమున రైలుబండి నెక్కిన జీవులు ధర్మమును ఆచరించుచు ప్రయాణము సాగించుచుండవలెను. ప్రయాణము నకు నియమములు వేద మేర్పరచిన శాశ్వత ధర్మములే. వానిని అనుసరించనివారు ఈ రైలుబండి నుండి దింపివేయ బడుదురు. అది కారణముగ ప్రయాణ మాగును. మరల ప్రయాణము సాగించవలె నన్నచో ధర్మనియమములను అనుష్ఠానము చేయ వలసిన బుద్ధి ఏర్పరచుకొనవలెను. లేనిచో వ్యర్థజీవనము సాగు చుండును. సృష్ట్యంతమున వీరు లయము చెందినను మరల బ్రహ్మమునుండి దిగివచ్చినపుడు అదే స్వభావ ముతో, అదే విధమైన అధర్మ ప్రవర్తనముతో మరల బంధింపబడుదురు.

మరణము గాని, సృష్టిలయము గాని జీవునికి ముక్తస్థితి ప్రసాదింపలేవు. అనుభవపూర్వకముగ ధర్మమే గతియని తెలిసి నిరహంకారుడై దాని ననుసరించినవాడే ముక్తమార్గమున మరల ప్రయాణము సాగించగలడు. ధర్మమునకు ప్రమాణము వేదము. వేదమునకు ప్రమాణము ఋషులు. (3-16)

## 10

# అసక్తత - సమాచరణము

తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచరన్ కర్మ పర మాప్నోతి పూరుషః ॥ 19

ఆసక్తి లేక కర్మ లాచరించిన వానికి పరమపదము లభించగలదని ఈ సూత్రము తెలుపుచున్నది. ఆసక్తి లేక కర్మ లెట్లాచరించగలరు? ఆసక్తి లేనివా డేపనియు చేయడే! దీని రహస్యమేమి? భగవంతుడు గీతయందు పలుమార్లు "అసక్తః" అని పలుకుతుంటాడు. ఈ పలికిన అసక్తత ఫలములకు సంబంధించినది. పనికి సంబంధించినది కాదు. పనిచేయు వానికి పనియందే ఆసక్తి యుండవలెనుగాని ఫలమునందు కాదు. ఫలమునం దాసక్తత యున్నవానికి పనియందు శ్రద్ధ చెడును. పనియందు శ్రద్ధ యున్న వానికి పనియే సౌఖ్యము నిచ్చును. ఫలములు పొందుట, పొందకపోవుట అతనిని బాధించవు. పని యందు సక్తుడవు కమ్ము, ఫలములయం దసక్తుడవు కమ్ము. ఇచ్చట పని యనగా పరహితముతో కూడినది అని మరల మరల చెప్ప నక్కరలేదు. నియత కర్మను అనగా చేయవలసిన కర్మను ఫల

ములయం దాసక్తిలేక యజ్ఞార్థముగ ఆచరించవలెనని భగవానుడు పలుకుతునే యున్నాడు. నిజమునకు ఫలములయం దాసక్తి లేకుండ కర్మ నాచరించవలెనని ఈ అధ్యాయమున 7వ శ్లోకము నందు, 9వ శ్లోకమునందు పలికినాడు. అట్లాచరించినచో పరమును లేక దైవమును పొందవచ్చని వాగ్దానము చేయుచున్నాడు. నిష్కామ కర్మమే మోక్షమునకు మార్గమని, అట్లు నిర్వర్తించినవానికి మోక్షము అరచేతి యందుండునని, ఇది తన శాసనమని తెలిపినాడు.

పై శాసనమునకు అనుపానముగ ఫలాపేక్షలేక, కర్మాచరణము అనునిత్యము జరుగవలెనని తెలుపు చున్నాడు. "సతతం" అని పలుకుటలో ఫలాసక్తి శాశ్వతముగ విసర్జించబడవలెనని తెలుపుచున్నాడు.

ఫలాసక్తి లేనిచో ఏ కార్యమైనను చేయవచ్చునా? అను సందేహమును గూడ నివృత్తి చేయుటకై "కార్యం కర్మ"ను ప్రస్తావించి నాడు. అనగా తాను చేయవలసినపని ఫలాసక్తి లేక ఎల్లపుడు చేయవలెనని.

ఫలాసక్తిలేక చేయవలసిన పని చేయువాడు ఎట్లైనా చేయవచ్చునా? అను సందేహమును నివారించుటకు "సమాచర" అని తెలిపినాడు. సమాచరణ మనగా సమ్యక్ ఆచరణము. సమ్యక్ ఆచరణ మనగా ఎక్కువ తక్కువలు లేక నిర్వర్తించుట. అనగా కర్మ నిర్వర్తనము ఒక నిర్మల ప్రవాహమువలె సాగవలెనుగాని ఒడుదొడుకులతో కాదని యర్థము. మార్గమున ఒడుదొడుకు

లున్నను ప్రవాహ వేగమునకు ఒడుదొడుకులు అవసరము లేదు. కొన్ని దినములు విపరీతముగ పనిచేయుట, కొన్ని దినములు చతికిల పడుటగా కర్మ జరుగరాదు. జరుగు కర్మయందు, వేగము నందు ఒక నిశ్చలత యుండవలెను. భూమి, ఇతర గ్రహములు చరించు విధానము సమాచర అను పదమునకు తగినట్లుగ నుండును. వృక్షముల యొక్క పెరుగుదల యందుగూడ ఈ లక్షణములు చూడవచ్చును. సమాచరణము సృష్టి ప్రవాహమునకు ముఖ్య లక్షణము. (3-19)

# 11

# సంఘ శ్రేయస్సు

కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।
లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి ॥ 20

కర్మమంతయు సంఘముతో ముడిపడి యున్నది. సంఘము నడుచుటకు కర్మము ప్రధానము. వివిధములైన వృత్తి, ఉద్యోగ, వ్యాపారముల ద్వారా ప్రతివారును సంఘమునకు తోడ్పాటు చేయుచు సంఘము నుండి లభించిన దానిని పొందుతూ జీవించుట జరుగుచున్నది. సంఘమునకు శ్రేయోదాయకమైన కార్యముల నొనర్చుట ద్వారా సంఘమున జీవించుటకు జీవు డర్హత పొందుచున్నాడు. వివిధ పద్ధతులలో సంఘమునకు జీవులసేవ లభ్యమగును. సంఘమునకు తోడ్పాటు చేయు ఆశయముతోనే సంఘమున పనిచేయవలెను. అట్లు పనిచేయు వారిని సంఘము సహజముగ మన్నించును, గౌరవించును, ఆదరించును కూడ. ఇట్లు సంఘమున ఆదరణము పొందినవారు,

గౌరవము పొందినవారు, ఇతరులు కూడ అదే మార్గమున ప్రవర్తించుటకు స్ఫూర్తిని కలిగింతురు.

అందువలన కృష్ణుని కర్మ సిద్ధాంతమున అసక్తత, నియత కర్మ, సమాచరణము, యజ్ఞార్థ జీవనములతో పాటు సంఘమున స్ఫూర్తిదాయకముతో గూడ నుండవలెనని తెలుపుచున్నది.

(3-20)

## 12

# పెద్దలు - ప్రమాణములు

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥ 21

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22

యది హ్యాహం న వర్తేయం జాతు కర్మ ణ్యతంద్రితః ।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ 23

ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః ॥ 24

*యద్యదాచరతి శ్రేష్ఠ :*

లోకమున పెద్దలు ఏమి చేయుచున్నారో గమనించి ఇతరులు కూడ వారి ననుకరింతురు. అందువలన పెద్దవారుగా గమనింపబడువారికి కర్మ నిర్వహణమున ఎక్కువ బాధ్యత గలదు. తమను అనుకరించువారు ఎవరికైతే యుందురో వారికి కర్మ నిర్వహణము నందు ఒక అదనపు బాధ్యత ఏర్పడును. తల్లి

దండ్రులను పిల్లలు అనుకరింతురు. ఉపాధ్యాయులను విద్యార్థు లనుకరింతురు. గురువులను శిష్యులనుకరింతురు. వివిధ రంగములలో ఉత్తమ శ్రేణికి చెందినవారిని ఆయా రంగములలో పనిచేయువా రనుకరింతురు.

అందువలన అనుకరింపబడు వారికి అనుకరించువారి యెడల బాధ్యత యున్నది. అదికారణముగ గుర్తింపుపొందిన పెద్ద వారు వారి కర్మనిర్వహణ విధానము ప్రమాణముగ నుండవలెను.

అనుకరించువారు అనునిత్యము తాము ప్రమాణముగ నేర్పరచుకున్న పెద్దవారిని అనుసరింతురు. వారు పొగత్రాగినచో వీరును త్రాగుదురు. వారికి అపరిశుభ్రపు అలవాట్లు ఉన్నచో వీరును అట్లే యుందురు. వారసత్యము లాడినచో వీరును ఆడుదురు. వారు బాధ్యతారహితముగ ప్రవర్తించినచో, వీరును అట్లే చేయుదురు. వారేమి చేసిన వీరును అట్లే చేయుటకు ప్రయత్నింతురు. అందువలన ప్రత్యేకముగ వారి కవసరము లేకపోయినప్పటికిని, చిన్నవారి మేలుకోరి పెద్దవారు కొన్ని కొన్ని విషయములలో మార్గదర్శకులై ప్రవర్తించవలసి యుండును.

నిజమునకు శ్రీకృష్ణునకు సాందీపని యొద్ద చేరి విద్య నభ్యసించు అవసరము లేదు. అయినను ఇతరుల శ్రేయస్సుకోరి అట్లాచరించెను. వివాహముతో పనిలేదు. అయినను సంఘ మర్యాదలు పాటించి వివాహమాడి సంతతిని కనెను. యుద్ధము

చేయవలసిన పని అసలేలేదు. అయినను క్షత్రియ జన్మ మెత్తుట వలన యుద్ధమునందు పాల్గొనెను. శ్రీరాముని జీవితము గూడ చాల విషయములలో అట్లే నిర్వర్తింపబడినది. శ్రీరాముని ఆదర్శముగ గొనిన భారతీయులు సర్వసామాన్యముగ ఏకపత్నీ వ్రతమును ఆచరించుదురు. భారతీయ సంప్రదాయమున నేటికిని ఈ భావము అధికముగ అనుసరింపబడు చున్నది. ఒక స్త్రీకి ఒక పురుషుడు. ఒక పురుషునకు ఒక స్త్రీ. ఈ సంప్రదాయము కేవలము భరతభూమియందే ఇంకను నిలచియున్నది.

భరత సంప్రదాయమునకు వెన్నెముకగ నిలచిన ఋషు లందరును ముక్తసంగులే. వారికీ ప్రపంచమున ఏమియును అవసరము లేదు. పంచభూతములు వారి వశమై యుండును. అయినప్పటికిన్ని ఇతర జీవులకు ప్రామాణికముగ నుండవలెనను బాధ్యతాయుత భావముతో వారు వివాహ మాడిరి. గృహస్థ జీవితమును నిర్వర్తించి చూపిరి. సంఘమున ఉద్యోగ వృత్తి వ్యాపారములను కూడ నిర్వర్తించిరి. అట్లు కానిచో సంఘధర్మము దెబ్బతినును. ఈ యంశము ననుసరించియే ఏసుక్రీస్తు, బుద్ధుడు మొదలగు మహాత్ములను గూడ భరతధర్మము పరిపూర్ణ మానవునిగ పరిగణించలేదు. ఈ మహాత్ములను అనుకరించువారు కూడ వారివలె వివాహమాడక, కోరికలను అణగద్రొక్కుకొని సతమత మగుచున్నారు. పశ్చిమ దేశములలో మతాధికారులు లైంగిక చర్యలకు పాటుపడుచు నేరగ్రస్తులగుట ఆధునిక కాలమున

గమనించబడుచునే యున్నది గదా! సాధారణ మానవులను మనస్సులో నుంచుకొని వారికి అనుకరణీయముగ నుండు శ్రేష్ఠమగు మార్గమును పెద్దలు నిర్వర్తించుట శ్రీకృష్ణుని కర్మ సిద్ధాంతమున మరియొక ముఖ్య లక్షణము.

ప్రస్తుత కాలమున దేశనాయకులు, మతాధికారులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, వైద్యులు, అగ్రశ్రేణి వ్యాపారస్తులు, అధికారులు పనిచేయు విధానము బాధ్యతారహితముగ యున్నది. అదికారణముగనే జనబాహుళ్యము గూడ బాధ్యత తప్పినది. క్రమ శిక్షణ తరిగినది. శ్రద్ధ లోపించినది. బాధ్యతలయందు పోటీ పడుటగా కాక హక్కులయందు పోటీపడు మ్లేచ్ఛ ధర్మము భరత భూమిని కూడ కబళించినది. ఇట్టి స్థితికి పెద్దలే కర్తలు. పెద్దలే బాధ్యులు. వీరు జనులను చెడగొట్టిన వారగుచున్నారు.

(3-21, 22, 23, 24.)

# 13

# కర్మ - ప్రతిఫలాసక్తి

సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథాఽసక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్ ॥ 25

*కుర్యాత్ విద్వాన్ అసక్తః చికీర్షులోక సంగ్రహం :*

తెలిసినవారు ఫలాసక్తి లేనివారై, లోక కళ్యాణమును నెరవేర్ప సంకల్పము గలవారై కర్మలను నిర్వర్తించవలెను.

ఫలాసక్తి గలవారు పట్టుదలతో, శ్రద్ధతో, దీక్షతో అహర్నిశలు ఫలముల నాశించి నిర్విరామముగ కృషి సల్పుదురు. ఫలాసక్తి లేనివారు అట్టి పట్టుదల, శ్రద్ధ, దీక్ష, ఏకాగ్రత, ఓర్పు కలిగి యుండరు. ఫలమునం దాసక్తి లేదు గనుక పనియందు గూడ ఆసక్తి లేకపోవుట మనస్సు ధర్మము. వేతనములేని పని మనస్సునకు రుచింపదు. తృణమో, పణమో లభించకుండ పనిచేయవలెనన్నచో నిర్విరామ కృషియుండదు. శ్రద్ధ ఉండదు. దీక్ష, పట్టుదల ఉండదు. ఇది లోక సహజము.

చిన్నపిల్లవాడు భోజనము చేయుటకు ఆశ కలిగింతురు. చదువుకొనుటకు చాక్లెట్లు, బిస్కెట్లువంటి ఆశ కల్పింతురు. ఏ పని చేయవలెనన్నను కూలివానివలె మనస్సు, పారితోషికము

నాశించును. ఈ మనోస్థితి నుండి బుద్ధిలోకములోకి పెరగనిచో వివిధములైన ఆశలు పెనుభూతములై, జీవితమున బంధములు పెరుగుట, జీవుడు వివశుడై దుర్గతి చెందుట జరుగును.

చిన్నపిల్లలు ఆశకు లోబడుదురు. చిన్నపిల్ల లనగా పరిణతి చెందని వారు. వారికి ధర్మ స్వరూపము, కర్మ స్వరూపము ఇంకనూ తెలియదు. ముందు శ్లోకములలో తెలిపిన విధముగ, కర్మ, ధర్మ స్వరూపముల నెరిగినవాడు ఏమి చేయవలెను? వాని ననుసరించుటయే బంధమోచన మార్గమని తెలిసి అనుసరించవలెను. అనుసరించినపుడు తమ మనోతత్త్వమే తమకు అడ్డుపడు చుండును. ఫలముల నాశింపక పనిచేయుట క్రొత్తగా అలవాటు చేసుకొనవలెను. పాత అలవాటు వలన మనసు ఫలితముల నాశించును. అది బలవంతముగ నుండును. క్రొత్త అలవాటునకు అంత బలముండదు. అందుచే ఫలాసక్తి లేక పనులు చేయవలె నన్నచో మనసు నిరసించును. అశ్రద్ధ చూపును. దీక్ష, పట్టుదల ఉండవు. నిర్లక్ష్యభావము, అహంభావము పెరుగును. ఇది ఎప్పటికప్పుడు నిర్మూలించుకొనుచు, పై తెలిపిన సద్గుణములతో ఫలాసక్తిని విడచి పనిచేయుట శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు.

ఫలాసక్తి లేకపోవుటే బంధమోచన మార్గముకాని, అదియే రూపమున నున్నను జీవుని బంధించును. ఫలాసక్తి ధన రూపము గను, గుర్తింపు రూపముగను, కీర్తి గౌరవము రూపముననను, ఆధిక్యత రూపముననను జీవునియందు పొంగుచుండును. దాని నెప్పటి కప్పుడు నిర్మూలించుకొనుచు, అత్యంత ఆసక్తి కలవానివలె కర్మల నాచరించవలెనని భగవంతుడు తెలుపుచున్నాడు. (3-25)

# 14

## సదాచరణ

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసంగినామ్ ।
జోషయే త్సర్వకర్మాణి విద్వా న్యుక్తః సమాచరన్ ॥ 26

*జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ :*

సదాచరణమే అత్యుత్తమ బోధ. సామాన్యముగా జీవులు అజ్ఞానముచే కర్మ లాచరించు చుందురు. వారు ఫలాసక్తి గలవారు. చంచలబుద్ధి కలవారు. వారికనేకానేక సద్విషయములను బోధించినచో బుద్ధియందు తికమక కలుగును. అజ్ఞానులకు జ్ఞానబోధ చేయుటకన్నా జ్ఞానులు తామాచరించుచు, వారలచే నేర్పుతో ఆచరింపచేయవలెను. ఆచరించిన దానిని చూచి అట్లే ఆచరించుట అల్పబుద్ధులకు సులభము. తామాచరింపక చేయు సద్బోధలను అల్పజ్ఞానులగు శ్రోతలు తమకు తోచిన విధముగా నాచరింతురు. సామాన్యముగా చేసిన బోధ వినువారలనుబట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క రకముగ వినిపించును, అనిపించును. ఒకే విషయము వైవిధ్యముగ ప్రకాశించును. పాత్ర పవిత్రతను బట్టి

పదార్థము రుచి మారునట్లు శ్రోత చిత్తశుద్ధిని బట్టి, విషయము లవగాహన యగును. అందుచేత విని యాచరించుట కష్టము. ఆచరించిన దానిని చూచి, అట్లే ఆచరించుట సులభము. **సాధన లేని బోధన బాధను మిగుల్చును**. కావున సిద్ధుడు తానాచరించుచు, ఇతరులచే అట్లాచరింపచేయుట శ్రేష్ఠము. అనుయాయులు కూడ, ఆచరించువారిని అనుసరించుట క్షేమము. (3-26)

# 15

# గుణత్రయ సృష్టి

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహంకార విమూఢాత్మా కర్తాహ మితి మన్యతే ॥ 27

సమస్తమును తానే నిర్వర్తించుచున్నాడు అని తలచుట అహంకారము. మూఢత్వ మున మానవుడట్లు భావించుచున్నాడు. కర్మములన్నియు ప్రకృతి నుండి పుట్టిన గుణములచే ఏర్పడు తున్నవి. సమస్త కర్మలకును గుణత్రయమే కారణము. వాని యందు జీవుడు ఉపస్థితుడై యున్నాడు. తానుండుటచే వానికి కదలిక కలదు. తాను లేనిచో వానికి కదలిక లేదు. ప్రకృతి జడమే. అందు చైతన్యము చేరినపుడు వివిధములుగ వర్తించును.

ఉదాహరణకు విద్యుత్ పరికరములన్నియు జడములే. అనగా తమంత తాము పనిచేయవు. విద్యుత్తు సాన్నిధ్యమిచ్చినచో ఒక్కొక్క పరికరము ఒక్కొక్క రకముగ పని చేయును. వైవిధ్యము పరికరముల యందు వున్నదిగాని, విద్యుత్తుయందు లేదు. విద్యుత్తు ఎప్పుడును విద్యుత్తే.

అట్లే, జీవుని సాన్నిధ్యమున అతని త్రిగుణాత్మక ప్రకృతి

వర్తించుచుండును. నర్తించుచుకూడ నుండును. అదియును జీవుడు స్వభావముతో సంగమము నొందినప్పుడే.

స్వభావములో సంగము చెందుటచేతనే అతడు జీవుడు. లేనిచో దేవుడే. దేవుడు సంగము లేక సృష్టి యందుండును. ప్రకృతి తన గుణములతో అంతయు అల్లిక చేయును. గుణములలోనికి దిగిన జీవుడు అహంకారియై చేయుచున్నా ననుకొనును.

లేనిచో స్వభావము జడమై యుండును. తాను చేయువాడు కాడు. స్వభావమే చేయించును. స్వభావమున కాకర్షణ చెందుటచే జీవుడు బంధింపబడుచున్నాడు. తానే చేయుచున్నట్లు భ్రమపడు చున్నాడు. తన యాధారముగ నిజమునకు గుణములు అంతయు చేయుచున్నవి. తాను కర్త కాదు. సాక్షి, ఆధారము, ప్రకృతికి ఆలంబనము. చేయునది మాత్రము ప్రకృతియే. ఇది తెలిసినవాడు తెలిసినవాడు. తెలియనివాడు అహంకారి. అట్టివాడు మూఢాత్ము డని భగవానుడు తెలుపుచున్నాడు. (3-27)

# 16

# సృష్టి రసాయనము

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః ।
గుణాగుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥ 28

సృష్టి యంతయు ఒక రసాయనము. పురుషుని సాన్నిధ్యమున ప్రకృతిశక్తులు రసాయనము చెంది, సృష్టిగ వర్తించుచున్నవి. గుణములు గుణములయందు అహర్నిశలు రసాయనము చెందుచూ, సృష్టికార్యము నడచుచున్నది. సమస్తమగు కర్మకాండ గుణముల నుండియే పుట్టుచున్నది. అందుచే జీవుడు సంగము లేక వీని యందు ప్రవర్తించినచో ముక్తుడుగ నుండును. సంగము కలిగినచో బద్ధుడగును. సంగము లేక కర్మ లాచరించుటయే కర్మలయందు కౌశలము. సంగము వలననే జీవుడు ద్వంద్వములకు చిక్కును.

నిజమునకు ప్రకృతి రమణీయత, ఆకర్షణీయత చూచువానిని బట్టి యుండును. స్త్రీ, పురుష శరీరములుగ కన్పట్టుచున్నది రక్తమాంసాదులతో నిర్మించబడిన రూపమని తెలిసిన జీవుడు

వికారము చెందడు. లేనిచో వికారము చెందును. ఆకర్షణమునకు లోనగుట జీవునకు జరుగుచున్నదిగాని, ఆకర్షించు కార్యక్రమము ప్రకృతికి లేదు. సృష్టి ఆకర్షణముగ నున్నను, అట్టి ఆకర్షణమున కతీతముగ నున్నవారు గలరు. ఆకర్షణమునకు లోనైనవారునూ గలరు. ఈ భేదము సంగము లేకుండుట, ఉండుట వలన కలుగు చున్నది. అసంగుని సృష్టి ఆకర్షింపలేదు కదా! సనక సనందనాదు లట్టివారు.

సంగము ఒక బలహీనత. అసంగమే బలము. అసంగుడు ముక్తుడు. అతడు గుణముల వ్యాపారమున బడడు. అట్టివాడే యథార్థమును తెలిసినవాడు. (3-28)

# 17

## సంగము - అసంగము

ప్రకృతే ర్గుణసమ్మూఢాః సజ్జంతే గుణకర్మసు ।
తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవి న్నవిచాలయేత్ ॥ 29

కర్మసంగులు గుణములచే మోహము చెంది దేహేంద్రియములచే నిర్విరామముగా కర్మలు చేయుచుందురు. కామము ప్రధానముగా ఆ కర్మలు సాగుచుండును. సృష్టి తత్త్వము తెలిసిన జ్ఞానులు గుణ సంగము లేక దేహేంద్రియములచే కార్యములు నిర్వర్తింతురు. కర్తవ్యమే ప్రధానముగ వారి కార్యములు సాగును. ఇరు తెగలవారు కర్మలు చేయుచుందురు. కాని ఫలిత మొకటి కాదు. మొదటి తెగవారు సృష్టియందు మోహము చెంది, గుణ సంగులై కోరికయే ప్రధానముగ కర్మల నాచరించి అందు బద్ధులగుచున్నారు. రెండవ తెగవారు కోరిక బదులుగా కర్తవ్యము నాశ్రయించి కర్మలు నిర్వర్తించుట వలన సంగదోషము లేక జీవన విభూతిని పొందుచున్నారు.

బుద్ధిమంతులు కామము, కర్తవ్యములయందు విచక్షణ కలిగి యుండవలెను. కర్తవ్యమునకు ఫలితమాసించుట యుండదు. కర్తవ్య నిర్వహణమున కామము లేదు. కామ్యకర్మలు కర్తవ్యములు

కావు. మాట, చేతల కుపక్రమించునపుడు కర్తవ్యమా కాదా అని పరీక్ష చేసుకొని చూసినచో, కామ్యమో కర్తవ్యమో సులభముగ తెలియును. ఇట్టి పరీక్ష చేసుకొననిచో బుద్ధి భేదము కలుగును. మూఢత్వము కలుగును. మోహము కలుగును. అహంకారము కలుగును. అజ్ఞానము కలుగును. కర్మలయందు మునుగును అని భగవానుడు నాలుగైదు రకములుగ హెచ్చరించియున్నాడు. కర్తవ్యమునే ఆసక్తితో నిర్వర్తించుట భగవానుడు తెలిపిన సుళువు. చేయవలసినదా? చేయదలచినదా? వలసినదే అయినచో కష్ట నష్టములు, జయాపజయములు, లాభనష్టములు చూచుకొన నవసరము లేదు. చేయదలచినదైనచో ద్వంద్వము లుండును.

కావున ప్రకృతియొక్క గుణములచే సమ్మోహితులైనవారు కామ్య కర్మలే చేయుదురు. అట్లు చేయగూడదని తెలుపువాడు తెలిసినవాడు కాదు. ఎట్లు చేయవలెనో తెలుపుట ప్రధానము. కామ్యకర్మ నుండి కర్తవ్య కర్మకు క్రమశః మళ్ళించుట జ్ఞానులు చేయవలసిన పని. సామాన్యముగ పండితులు, గ్రంథములు చేయకూడనివి తెలుపుట ఎక్కువగ జరుగును. చేయవలసిన దానియందు రుచి కల్పించి, చేయదలచిన వాని నుండి క్రమముగ తప్పించుట జ్ఞానులు, యోగులు చేయవలసిన పని. అంతియే గాని కర్మము సంగము కలిగించునని భయపెట్టరాదు. కర్మము కామ్యమైనచో సంగముండును. కర్తవ్యమైనచో అనుభూతి యుండును.

శ్రీరాముని జీవితము కర్తవ్య నిర్వహణమునకు ప్రమాణము. అతడు సంగములేక కర్తవ్యమును నిర్వర్తించినాడు. (3-29)

# 18

## శరణాగతి

మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30

భగవంతుడు కర్మలయందు శరణాగతి మార్గమును కూడ నందించినాడు. సమస్త కర్మలను తనయందు సన్యసించి, ఆశా మమకారము లేక, నిర్వర్తించుచుండుమని ఆదేశించినాడు. 'సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు', 'బ్రహ్మార్పణమస్తు' అను పదములు వినుచునే యున్నాము. రెంటియర్థము ఒకటే. చేయుటయందలి సుళువులు బుద్ధిబలముచే గ్రహించుట సుళువు కాదు. కొన్ని సమయములందు విచికిత్స యుండగలదు. చేయవలసినదా, చేయదలచినదా అనునది సులభముగ తేలదు. అపుడేమి చేయవలెను? ఇట్టి ప్రశ్నలు నరులకు సహజమే. చేయవలసినది కానిచో కర్మఫల మేర్పడునేమో, చేయవలసినది చేయకుండినచో అందుండి కూడ ఫలితములు ఏర్పడునేమో. చేయవలెనా? వలదా? అను ప్రశ్నలు పుట్టవచ్చును. ధర్మజ్ఞునికైననూ సంకటము

కలిగించు సన్నివేశములు పురాణములయందు కోకొల్లలుగా నున్నవి. ఇట్టి సమయమున విచికిత్స కన్న దైవమునకు సమర్పణముచెంది, తోచినది చేయుటయే శరణ్యము. కాని శరణాగతి మార్గమునకు దైవము రెండు నియమముల నేర్పరచి నాడు. ఆశ, మోహము అనునవి దరిచేరనీయక తోచినది దైవార్పణ బుద్ధితో చేయుట.

అర్జునుడు విచక్షణాపరుడే. ధర్మపరుడే. కర్తవ్య నిర్వహణ మున చెదరనివాడు. అట్టివానికే యుద్ధము చేయవలెనా? వద్దా అను ప్రశ్న పుట్టినది. అట్లు పుట్టుటకు కారణము పితామహుని యందు, గురువు నందుగల మోహమే. ఇతరులను సంహరించుట కతడు సంసిద్ధుడే. కాని తాతయందు మోహము వలన కర్తవ్యమున చెదరెను. ఏమియు పాల్పడక చతికిలపడెను. అట్టి మోహబద్ధునికి కర్తవ్యమును గూర్చి వివరించిననూ అది యందదు. అందువలన శరణాగతి మార్గమును దైవము బోధింపవలసి వచ్చినది. నరులకిట్టి సంకటములు సహజమే. అట్టి సమయమున దైవార్పణముగ కార్యములు నిర్వర్తించుట యిచట తెలుపబడినది. కర్మ మార్గమున దైవమిచ్చు తుది పరిష్కార మిదియే. భారము భగవంతునిపై వేసి ఆశామోహములు లేక తోచినది చేయుట అనునది సూత్రము.

(3-30)

# 19

## శరణాగతి సూత్రములు

యే మే మత మిదం నిత్య మనుతిష్ఠంతి మానవాః ।
శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః ॥ 31

శరణాగతి మార్గమును తెలిపిన భగవంతుడు మరిరెండు నియమములను కూడ సూచించుచున్నాడు. మొదటి నియమములు ఆశను, మోహమును వదలి కర్మమును సమర్పణ బుద్ధితో నిర్వర్తించుట. మరిరెండు నియమములు శ్రద్ధ కలిగి అసూయ లేకుండుటగ తెలిపినాడు. అనగా దైవమునకు సమర్పణము చేసుకొని తన బుద్ధికి తోచినది తాను చేయుటకు మొత్తము నాలుగు నియమము లీయబడినవి.

1. మోహము లేకుండుట.
2. ఆశ పడకుండుట.
3. అసూయ లేకుండుట.
4. శ్రద్ధ కలిగియుండుట.

పై నాలుగు నియమములు సర్వకర్మలయందు, సర్వ కాలములందు పాటించుట శరణాగతి కాగలదు. "నిత్యం అనుతిష్ఠంతి" అనుటలో ఎల్లప్పుడునూ అనుసరించ వలెనని హెచ్చరిక. అట్లు నిర్వర్తించు వానిని దైవమే నడుపును. తనను శరణుపొందిన వానిని తానే రక్షించునని, మోక్షము నిచ్చునని దైవము యొక్క వాగ్దానము. ఈ మార్గమునకు దైవమునందు పరిపూర్ణ విశ్వాసమే పునాది. అది అరుదు.

ప్రస్తుతకాలమున శరణాగతి తమ ఆశలను, కోరికలను తీర్చుకొనుటకే ఆస్తికులు చేయుచున్నారు. వీరి శ్రద్ధయును అంతంత మాత్రమే. అనసూయత్వము అసలే కరవు. మేము గురువునకు, దైవమునకు శరణాగతి చెందినాము అనుచుందురు. అట్టివారు పై నాలుగు నియమములు గమనించుచున్నారేమో పరిశీలించుకొనవలెను. (3-31)

## 20

# ఎంపిక

**యే త్వేత దభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।**
**సర్వజ్ఞాన విమూఢాం స్తాన్ విద్ధి నష్టా న చేతసః ॥ 32**

బుద్ధిమాంద్యులకు కర్తవ్యమేదో, కామమేదో తెలియదు. కామమే కర్తవ్యమని నిర్వర్తించుటవలన వారు బంధింపబడు చున్నారు. బుద్ధిమంతులకు కర్తవ్యము సూటిగ గోచరించును. వారు దానినే ఆచరింతురు. కావున బుద్ధిమాంద్యుల కొరకు దైవము కరుణతో శరణాగతి మార్గమును వాగ్దానము చేసెను. బుద్ధి ననుసరింప లేనివారు దైవము నాశ్రయించ వచ్చునని తెలిపినాడు. బుద్ధి ప్రచోదనము కాక, శరణాగతి నచ్చక బ్రతుకు జీవులమాట యేమి?

తమను తామైనా ఉద్ధరించుకొనవలెను లేదా సమస్తము నుండి ఉద్ధరించు వానిని ప్రార్థించుచూ శరణము పొందవలెను. రెండును చేయని వారిని ఎవరు రక్షింప గలరు? ఎవరునూ రక్షింపలేరు.

“కర్తవ్యమును నిర్ణయించుకొనుచు చేయుము లేదా నేను చెప్పినట్లు చేయుము.” అని అర్జునునితో శ్రీకృష్ణుడు పలికినాడు. నీ కర్తవ్యము సరియైనది అగుచో అది నిన్ను బంధించదు. సరియగు నిర్ణయము చేసుకొనలేననిపించినచో, నా నిర్ణయమును పాటించుము. అప్పుడు నీ బాధ్యత నాదే. రెండింటిని కాదన్నచో నష్టపడుట తప్పదు. అటుపైన నీ యిష్టము అని దైవము అర్జునుని ద్వారా నరులకు తెలుపుచున్నాడు. ఎంపిక చేసుకొనవచ్చునని నరునికే నిర్ణయము వదలినాడు. (3-32)

# 21

## నిగ్రహము - అనుగ్రహము

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్ జ్ఞానవా నపి ।
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ 33

భగవానుడు బుద్ధినికాని, తననుకాని ఆశ్రయించి కర్మమును చేయమని తెలుపుచు మరియొక ముఖ్యాంశమును ఆవిష్కరించు చున్నాడు. ఇది తెలిసినచో దైవమునకు శరణాగతియే మార్గమని, ఇతర మార్గములు పూర్ణశ్రేయోదాయకము కాదని తెలియును. ఇది తెలియుట ముఖ్యము.

ఎంత జ్ఞానవంతుడైనను ప్రకృతిలోని వాడేగదా! త్రిగుణ ముల కీవలివాడు జీవుడు, ఆవలివాడు దేవుడు. ప్రకృతినుండి పుట్టిన జీవులు ప్రకృతిని దాటలేరు. తమ ప్రకృతికిలోనై మాత్రమే జీవించగలరు. జ్ఞానవంతుడైననూ యింతియే సుమా, అని శ్రీకృష్ణుడు హెచ్చరించుచున్నాడు. కావున ప్రకృతిని దాటుటకు దైవముయొక్క అనుగ్రహము, ప్రకృతియొక్క కరుణయు ముఖ్యము. రెండునూ ఒకటియే. బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు వంటి లోకపాలకులు కూడ ప్రకృతిమాయలో పడినవారే. పార

పాట్లు చేసినవారే. మరల దైవానుగ్రహముచేత, తమ స్థితియందు నిలిచిరి. ఇక మానవులందలి జ్ఞానులెంత? వారి నిగ్రహమెంత? భగవంతుని అనుగ్రహమునకై ప్రయత్నింపవలెను గాని, నిగ్రహ మార్గము ననుసరించుట కాదు. మనో దేహేంద్రియములు ప్రకృతి యధీనమున నున్నవి. తన యధీనమున యున్నవని భావించు వాడు అవివేకి, అహంకారి. అందువలన చివరకు మిగులునది శరణాగతి మార్గమే. తమను, తమ జీవితమును, తమ కార్యక్రమ ములను పరిపూర్ణముగ దైవమునకు సమర్పించి, అతని అనుగ్రహము కొరకే జీవించుట కర్మ సంగములేని మార్గము. అహంకారమునకు లోబడియే బుద్ధి పనిచేయును. అహంకారము ప్రకృతికి లోబడి యుండును. అనగా గుణములకు లోబడి యుండును. కావున జ్ఞానియైననూ, దైవమునకు శరణ మనవలసినదే. మరియొక మార్గము లేదు.

దీనివలన తెలియవలసిన ముఖ్యాంశమేమనగా, సమస్తము నందు దైవచింతన పెంచుకొనుటయేగాని, "కామము పారద్రోలుడు, ఇంద్రియములను నిగ్రహింపుడు, సద్భావములే కలిగి యుండుడు, సత్ప్రవర్తనమే ఆశ్రయింపుడు" అని నినాదములు చేయుచు, బోధలు చేసినచో అవి యన్నియు నిరుపయోగములు. ప్రకృతి వశులగుటచేత ఎవ్వరునూ నిర్వర్తింపలేరు. దైవము నాశ్ర యింపుడు, దైవచింతనము పెంచుకొనుడు, అనురక్తితో భజింపుడు, దైవమును కామింపుడు, ప్రేమింపుడు అను వాక్యములు పై నినాదముల కన్న మిన్నగ పరిష్కార మందించును. (3-33)

# 22

## ఇంద్రియ సృష్టి - ద్వంద్వములు

ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయోర్న వశ మాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంథినౌ ॥ **34**

సృష్టి నిర్మాణమున ఇంద్రియసృష్టి ఒక ప్రధాన ఘట్టము. ఇంద్రియములే లేనిచో మానవుడు బహిఃప్రపంచముతో ప్రతి స్పందించలేడు. ఇంద్రియముల ద్వారానే రుచి, స్పర్శ, వాసన, చూపు, వినికిడి అనుభవించుచున్నాడు. దేహ పోషణకు, దేహ రక్షణకు తగుమాత్రము దేహానుభూతికి ఇంద్రియము లవసరము. ఇంద్రియములే లేనిచో మానవుడు తన శరీరమును తానుగ పోషించుకొనలేడు. రక్షించుకొనలేడు. దశేంద్రియములు ప్రచేతస ప్రజ్ఞలు. అవి రుద్రుని ఆజ్ఞగా ఇంద్రియము లందు పనిచేయు చున్నవి. ఈ ప్రజ్ఞలు దివ్యములు.

సృష్టియందు ఇంద్రియార్థము లున్నవి. మానవునియందు ఇంద్రి యము లున్నవి. ఇంద్రియార్థముల ద్వారా దేహ పరిపోషణ, తదనుభూతి కావించుకొనవచ్చును. రుచిలేనిచో మానవుడు

భుజించునా? భుజించి దేహమును పోషించుట కర్తవ్యము. అందులకు రుచి సంధానకర్త. భుజించుటకు రుచి కాని, రుచి కొరకు భోజనము కాదు. హితమును మితముగ భుజింపుమని ఆదేశము. మితి మీరినచో హితవస్తువు విషమగును. ఇట్లే యితర ఇంద్రియముల విషయమున కూడను మితిమీరి నపుడెల్ల తీపి అనుభవము చేదుగ మారును. ఆహారము వలన పుష్టివంత మైన శరీరమును ఏర్పరచుకొనవచ్చును. ఆహారము వలన అనారోగ్య మును కూడ పొందవచ్చును. ఇట్లు మితిమీరినపుడెల్ల ద్వంద్వాను భూతి కలుగును. ద్వంద్వములయందు చిక్కినచో బంధములు కలుగును. బంధములు దుఃఖములను కలిగించును. సర్వ విషయములయందు మితి ఒక మార్గము. **మితి తప్పినచో గతి తప్పును**. ద్వంద్వములే మానవునకు శత్రువులని దైవము హెచ్చ రించుచున్నాడు. వాని కింద్రియములు ముఖద్వారములని తెలుపు చున్నాడు. (3-34)

# 23

# స్వధర్మము

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35

ప్రతి మానవునకు తనదైన స్వభావము ఒకటి యుండును. తదనుగుణమైన కార్యమునందు నిమగ్నమైనచో శ్రేయస్సు కలుగును. లేనిచో భయము కలుగును. కొందరికి ఉపాధ్యాయ వృత్తి నచ్చును. కొందరికి పదిమందిని రక్షించుట నచ్చును. కొందరికి వ్యాపారము నచ్చును. మరికొందరికి శరీర శ్రమ నచ్చును. తనకు తానుగ పరిశీలించుకొని చూచినచో తన ప్రవృత్తి కేమి నచ్చునో తనకు తెలియగలదు. దానినే శ్రద్ధతో నిర్వర్తించినచో శ్రేయస్సు కలుగును. ఆనందము కలుగును. తృప్తి కలుగును. అట్లుకానిచో ఘర్షణలు, భయము కలుగును.

ఆధునిక యుగమున మానవుడు స్వభావమును బట్టి కార్యక్రమము నేర్పరచు కొనుట మరచినాడు. డబ్బును బట్టి పని యెన్నుకొనుచున్నాడు. ఏది యెక్కువ డబ్బునిచ్చునో అది

చేయవలెనని తల్లిదండ్రులు కూడ ప్రోత్సహింతురు. ప్రవృత్తిని బట్టి వృత్తి నిర్ణయము జరుగుటలేదు. ధనార్జనము, సంఘమునందు కీర్తి, గొప్పదనము కలిగించునవి చేయుటకే ప్రవర్తించు చున్నాడు. ఘర్షణమున కిదియే మూలము.

ఇష్టములేక డబ్బు కొరకు ఉద్యోగము చేయువారు, యిష్టము లేకపోయినను ఉపాధ్యాయ వృత్తియందున్న వారు, అట్లే వ్యాపారులు, రక్షణాధికారు లున్నారు. ఎవరిని ప్రశ్నించినను వారు చేయు పనులయందు వారికి తృప్తి లేదు. ఆనందము లేదు. మీదు మిక్కిలి భయముండును. కుశలమా అని ప్రశ్నించి నచో త్రికరణశుద్ధిగ ఎవ్వరును కుశలమని చెప్పలేరు.

తన శ్రేయస్సు తనకు గల ధనముపై యాధారపడి యున్నదని భ్రమపడి అట్టి ధనార్జనకు వీలుగనుండు వృత్తితో ముడిపడి అది తన ప్రవృత్తికి విరుద్ధమగుట వలన ఘర్షణము చెందుచు, భయ పడుచు, రోగములు తెచ్చుకొనుచు నశించుచున్నారు.

ధనార్జన ప్రధానమగుట ఒక కారణము కాగ, తన పనికన్న పొరుగువాని పని బాగున్నదని మరియొక భ్రమ యగుచున్నది. కోతి పని కోతి చేయవలెను, వడ్రంగిపని వడ్రంగి చేయవలెను అను సూత్రము ప్రధానము. కుక్క పని కుక్క చేయవలెను, గాడిద పని గాడిద చేయవలెను. తన పనికన్న కుక్కపని బాగున్నదని గాడిద కుక్కపని చేసి భంగపడినది. గొప్పకు ఒక కోతి వడ్రంగి

పనిచేసి, ప్రాణసంకటము తెచ్చుకున్నది. ప్రస్తుతము మానవుల ప్రవర్తనము యింతకన్న ఉత్తమముగ నున్నదని చెప్పలేము కదా! ప్రవృత్తిచే అర్జునుడు యోధుడు. ధర్మరక్షకుడు. వీరుడు. ధర్మరక్షణము చేయక మరియేమి చేసినను అతడపహాస్యము పాలగును. అపహాస్యమగుట మహావీరునకు మరణముకన్న దుర్భరము. యుద్ధభూమినుండి పారిపోయినాడని నలుగురూ నవ్వినచో అర్జునుడు బ్రతుకలేడు. పిరికివాడని హేళన చేసినచో భరించలేడు. ధర్మరక్షణ చేయని పాపి అనిపించుకొనినచో బ్రతుకడు. అతనికి స్వాభిమానము మెండు. అట్టివాడు నేను యుద్ధము చేయను, తపస్సునకు పోయెదను అని పలుకుట మోహము వలన కలిగినది. భగవంతుడు స్వధర్మమే శ్రేయస్సు, అందు మరణించినను శుభమే. అధర్మము నిన్ను నశింపజేయును అని తెలిపినాడు.

భగవద్గీతయందు తెలుపబడిన అత్యంత ప్రధానమైన సూత్రములలో స్వధర్మము ఒకటి. యుక్త వయస్సునందు స్వధర్మము తెలిసి, వృత్తి నెంచుకున్నవాడు ధన్యుడు. (3-35)

## 24

# అగ్నికార్యము

సామాన్య మానవుడు కావలెనని పాపము చేయడు. కాని స్వభావము బలముగ ఆకర్షించి అతనిచే పాపములను నిర్వర్తించు చుండును. పాపము చేయుచుంటిని అని తెలిసియు అందుండి బయటపడలేడు. దీనికి కారణమేమి? అని అర్జునుడు ప్రశ్నించినాడు.

నిజమునకు భగవంతుడు సమాధానము యిచ్చియే యున్నాడు. తెలిపినను మరచుట మానవ సహజము. మరల తెలుపుట ఉపాధ్యాయుల ధర్మము. సద్గురువు ధర్మము. గుణములు గుణములతో ప్రవర్తించుననియు, ప్రకృతి గుణము లచే మోహపడుట సహజమనియు, జ్ఞానులు సైతము గుణా కర్షణము కారణముగ నిగ్రహమును కోల్పోవుదురనియు తెలిపి యున్నాడు. మరల ప్రశ్నించుటచే భగవంతు డిట్లనుచున్నాడు.

గుణములలో మొదటిది రజస్సు. అది యిచ్ఛను కలిగించును. ఆకర్షణను కలిగించును. కోరిక కలిగించును. దీని

మరియొక నామమే కామము. కామమును విచక్షణతో నిర్వర్తించు కొనవలెను. విచక్షణకు బుద్ధి యాధారము. మనుష్యుని బుద్ధి కర్మాధీనమై యుండును. కావున అది అక్కరకు రాదు. అందు వలన దైవము బుద్ధి తనయందు స్థిరపడవలెను. దానికి దైవమే శరణ్యము. సరియగు దైవారాధనము మనయందలి దైవబుద్ధి కేంద్రమును మేల్కొల్పును. అది ధర్మమునకై మ్రొగ్గి యుండును. అపుడాకర్షణలు పనిచేయవు. కావున దైవారాధనమునకు ఫలశ్రుతి బుద్ధి ప్రచోదనము. బుద్ధియందు స్థిరపడినవాడు పూర్ణ విచక్షణ దైవానుగ్రహముగ పొందియుండును. అపుడు రజోగుణ మతనిని స్పృశింపదు. కామము ధర్మయుక్తమై వర్తింపబడుచుండును. మనసు, యింద్రియములు బుద్ధియందు సంయమము చెందగ, బుద్ధి దైవముతో అనుసంధానము చెందుటచే గుణాతీతుడై గుణముల యందు ప్రవర్తించుట జరుగును.

ఇట్లు బుద్ధియందు స్థిరపడుటకు బుద్ధి ప్రచోదనమునకై దైవారాధనమును ప్రతినిత్యము నిర్వర్తించవలెను. అనునిత్యము సాగవలెను. అద్దమును ప్రతినిత్యము శుభ్రపరచుకొననిచో దానిపై దుమ్ము చేరును గదా. దీపము వెలిగించినచో కొండె ఏర్పడుచున్నది గదా. అన్నము వండినచో పాత్రకు మసి యగుచున్నది గదా. దంతధావనము, స్నానము చేసినను మరునాటికి శరీరము మలినములను కలిగి యుండును కదా. సృష్టియంతయు ఒక

అగ్నికార్యము. అగ్నికార్యమున పొగ, మసి తప్పవు. వాటిని నిత్యము శుభ్రపరచుకొనవలెను. లేనిచో మసి తప్పదు. మసికి మరొక పేరే పాపము. కావున దైవధ్యానము, ఆరాధనము అను నిత్యము చేసుకొనుచు జీవించుట శరణ్యమని దైవము తెలిపెను. జ్ఞానులకైనను మరియొక మార్గము లేదని తెలిపెను.

# OTHER BOOKS THROUGH
## MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKS :**

| | | |
|---|---|---|
| 1. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 2. | THE AQUARIAN MASTER | E/G/S |
| 3. | SOUND –The Key & its Application | E/G/S |
| 4. | ASHRAM LEAVES | E/G/S |
| 5. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 6. | VENUS –The Path to Immortality | E/G/S |
| 7. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 8. | SHIRDI SAI SAYINGS | E/G/S |
| 9. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 10. | THE MASTERS OF WISDOM | S |
| 11. | MEDITATION & GAYATRI | S |
| 12. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 13. | ON HEALING | E/G/S |
| 14. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 15. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 16. | THE AQUARIAN CROSS | E/G/S |
| 17. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 18. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |

| | | |
|---|---|---|
| 19. | SRI DATTATREYA | E/G/S/T/HI |
| 20. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 21. | JUPITER –The Path of Expansion | E/S |
| 22. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |
| 23. | AMANASAKUDU | T/K |
| 24. | VRUTRASURA RAHASYAM | T |
| 25. | THE DOCTRINE OF ETHICS | E |
| 26. | DHANAKAMUNI KATHA | T |
| 27. | ANTARDARSANA DHYANAMULU | T |
| 28. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 29. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 30. | ASANGUDU | T |
| 31. | SARASWATHI - THE WORD | E |
| 32. | MANA MASTARU GARU | T |
| 33. | GEETOPANISHAD (Sankhya Yogamu) | T |
| 34. | GEETOPANISHAD (Karma Yogamu) | T |
| 35. | ‘OM’KARAM | T |
| 36. | JYOTIRLINGA YATRA | T |
| 37. | SRI LALITHA | T |
| 38. | KATHA DEEPIKA | T |
| 39. | MASTER C.V.V. (Birthday Message) | T |
| 40. | MAITREYA MAHARSHI BODHALU | T |
| 41. | MARUVU MAHARSHI BODHALU | T |
| 42. | DEVAPI MAHARSHI BODHALU | T |
| 43. | HIMALAYA GURU PARAMPARA | T |

**BOOKLETS :**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME, THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |
| 12. | MARRIAGE - A SACRAMENT | E |
| 13. | MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU | T |
| 14. | POOJA VIDHANA PRASASTYAMU | T |
| 15. | GAYATRI MANTRA PRASASTYAMU | T |
| 16. | MANA SAMPRADAYAMU | T |

**ధనిష్ఠ ఇతర ప్రచురణలు :**

1. శ్రీ వినాయక వ్రతకల్పము
2. శ్రీ శరన్నవరాత్ర పూజావిధానము
3. శ్రీ హనుమాన్ చాలీసా
4. శ్రీ సూర్య పూజావిధానము
5. శ్రీ శివ హృదయము
6. శ్రీ మహాలక్ష్మి పూజావిధానము
7. శ్రీ వేంకటేశ్వర పూజావిధానము